క్లుప్తంగా

రాధారంగ మిత్ర మండలి ట్రస్టీగా నాగమల్లేశ్వరి



దాబాగార్డెన్స్ : రాధా రంగ మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్–తెలంగాణ ఉపాధ్యక్షురాలిగా విశాఖకు చెందిన నాగమల్లేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కమిటీలు వేస్తామని ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల పాలిట దేవుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటుకు ట్రస్ట్ ద్వారా కృషి చేయనున్నట్టు ఆమె తెలిపారు.

జర్నలిస్టుల సేవలు మరువలేనివి



పాత్రికేయులను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ప్రతినిధులు

అల్లిపురం : జర్నలిస్టు డే సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ ఆధ్వర్యంలో సౌత్ జైలురోడ్డులో గల కార్యాలయంలో జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, రీజనల్ చైర్‌పర్సన్ వరిగాల పండు, సెక్రటరీ బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా తదితరులు మాట్లాడుతూ పాత్రికేయుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు డీవీఆర్ గుప్తా, ఎం.భద్రం, వంకాయల రవి, కేఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అల్లిపురంలో నివసిస్తున్న పులి వెంకటరెడ్డి అనే వ్యక్తి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అల్లిపురంలోని తన ఇంటి నుంచి బైక్ మీద మురళీనగర్‌కు ఓ పని మీద బయలుదేరి వెళ్లాడు. తాటిచెట్లపాలెం హైవే దరి ధర్మానగర్ దగ్గరకు వచ్చేసరికి అదే దారిలో సర్వీస్ రోడ్డు నుంచి ఓ కారు హైవే వైపు వెళ్తూ ఇతడిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తలకు ఎడమవైపు గాయాలయ్యాయని వెంకటరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

పోషకాహార వంటల పోటీలు



వంటలను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌లలితాదేవి

ఆరిలోవ : జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం పోషకాహార వంటల పోటీలు నిర్వహించారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రీషియన్ వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని వివిధ రకాల వంటలు తయారు చేసి ప్రదర్శించారు. బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ కిరణ్ లలితాదేవి పాల్గొని వంటకాలు పరిశీలించారు. రుచికరంగా వంటలు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వల్ల చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు సౌజన్య, శంకర్, సాయి, రేవతి, గౌతమి, స్వాతి, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గోపిక వేషధారణలో చిన్నారి





శ్రీకృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు



వేంకటేశ్వరమెట్టపై శ్రీ కృష్ణుని విగ్రహంతో తిరువీధి నిర్వహిస్తున్న మహిళలు



అల్విన్ స్కూల్లో కృష్ణుడి వెంట గోపికలు

వసుదేవ తనయా.. కరుణించరావా

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు



గీతాభవన్‌లో పూజలందుకుంటున్న కృష్ణ భగవానుడు

దాబాగార్డెన్స్/అల్లిపురం : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పంచామృతాభిషేకాలు జరిపారు. చాలా ప్రాంతాల్లో చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణతో అలంకరించారు. మహారాణిపేట జిల్లా పరిషత్ సమీపాన గల కృష్ణ చైతన్య మఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా పసిపిల్లల పాదాలకు పారాణి రాసి ఇళ్లల్లో నడిపించి, చిన్ని కృష్ణుని ఆహ్వానించినట్టు చేశారు. నియోజకవర్గ పరిధి అల్లిపురం, కోటవీధి, చెంగల్రావుపేట, మహారాణిపేట, డాబాగార్డెన్స్, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో సాయంత్రం ఉట్ల సంబరం నిర్వహించారు.



ఆర్యవైశ్య యువజన సంఘంలో సందడి చేస్తున్న రాధాకృష్ణులు

ఆర్యవైశ్య యువజన సంఘంలో..

పాతనగరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రావణమాస సంబరాల్లో భాగంగా బుధవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులచే కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణ పోటీలు, చిన్నారి కృష్ణుల చిలిపి పనులు, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు సందడిగా నిర్వహించారు. సుమారు 45 మంది చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు నల్లూరు నూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్, తమ్మన నీరజ, మాదేటి జ్యోతి, నేతి అరుణ, కోడూరు లక్ష్మీ, పి. అమ్మాజీ, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి గ్రంధి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో..

వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతాభవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గోపూజ జరిపారు. అనంతరం గో సహిత శ్రీకృష్ణ భగవాన్ పంచలోహ ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. గీతాప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వేంకటేశ్వరమెట్టపై కోలాటం ఆడుతున్న మహిళలు

29వ వార్డు పలు వీధుల్లో..

జీవీఎంసీ 29వ వార్డు పలు వీధుల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామజోగిపేట యూత్, ఊటగెడ్డ శ్రీకృష్ణ యాదవ సంఘం, కలెక్టరేట్ జంక్షన్ శ్రీదుర్గా గణపతి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వేంకటేశ్వరమెట్టపై..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అల్లిపురంలోని వేంకటేశ్వరమెట్టపై ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ కృష్ణుని విగ్రహంతో కలిసి వేంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, నీలమ్మ వేపచెట్టు, మూడుగుళ్ల వీధి తదితర ప్రాంతాల మీదుగా గోవింద నామస్మరణతో తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు కాండ్రేగుల మంగరత్నం, కార్యదర్శి సుగుణ, సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



29వ వార్డులో రామచంద్రరావుకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



బద్రి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఆపదలో ఉన్నవారికి అండగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిలిచారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఆరోగ్యం బాగులేని వారి ఇంటికి ఎమ్మెల్యే బుధవారం స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సహకారం అందజేశారు. 34వ వార్డు కొబ్బరితోట ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాగతి రాజు (బద్రి) కొన్ని నెలల క్రితం మరణించారు. వారింటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. అతని పిల్లల ఫీజులో రాయితీ ఇప్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. అదే ప్రాంతానికి చెందిన సీనియర్ కార్యకర్త అంబటి విజయలక్ష్మి గత కొంత కాలంగా కీళ్ళవాతం, పెరాలసిస్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆమె ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజుతో మాట్లాడి ట్రీట్‌మెంట్ అందించమని కోరారు. 31వ వార్డుకు చెందిన నేమురు రాజు రోడ్డు ప్రమాదానికి గురై మంచాన పడ్డాడు. తల్లిపై ఆధారపడిన అతనికి కుటుంబ పోషణ కష్టతరంగా ఉండటంతో రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 29వ వార్డు పరిధి వెంకటేశ్వరనగర్ సచివాలయ గృహసారథి తల్లి రావ్వకూరి పెద్దిలమ్మ గత కొన్ని సంవత్సరాలుగా బోధకాలు, కళ్లు కనపడకపోవటంతో వారి అభ్యర్థన మేరకు రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. వెంకటపతిరాజునగర్ ప్రాంతానికి చెందిన సింగంపల్లి రామచంద్రావు పెరాలసిస్ కారణంగా మంచానికే పరిమితం కావటంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండటంతో అతనికి రూ.3 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, స్టేట్ ఫారెస్ట్ డైరెక్టర్, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, స్టేట్ స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నీలాపు లక్ష్మీ, బాపు ఆనంద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, దూడ అప్పారావు, ధనలక్ష్మి, రాంబాబు, పెంటకోట బాబురావు, వనుకులు, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుడూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం



పిల్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి బీవీకే కళాశాలకు చెందిన రిటైర్డ్ సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకట రమణమూర్తిని ప్రత్యేక ఆహ్వానితుడిగా తానా సంస్థ ఆహ్వానించింది. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న ఇంటర్‌నెట్ మాధ్యమంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కవి సమ్మేళనంలో ఆయన పాల్గొంటారు. ప్రతిష్టాత్మక కార్యక్రమంలో స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేది నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌లకు రమణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు సహకరిస్తాం



మేయర్ హరి వెంకటకుమారిని సత్కరిస్తున్న ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కొన్ని స్కూల్స్ మూతపడుతున్న సమయంలో అసోసియేషన్ చేసిన సేవలు తాను తెలుసుకున్నానని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ మూర్తి, రాజీవ్ విద్యా మిషన్ ప్రతినిధి బి.శ్రీనివాస్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కోశాధికారి మూర్తి, రాష్ట్ర నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఉదయం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చేపల వేలం పాట వద్ద రద్దీ వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీని వల్ల మత్స్యకారులతో పాటు బోటు యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ స్పందన ద్వారా ఇటీవల కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చేపల వేలం కేంద్రం వద్ద ఎక్కువగా ఆటోలు నిలుపుదల చేయటం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖపట్నం ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ సమన్వయంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజీవ్ కుమార్ హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజుల పాటు శ్రావణలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు కనకమహాలక్ష్మీ దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091 లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

21వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం 21వ రోజుకి చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో కాల్వల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, మేయర్ మాట్లాడుతూ సుమారు రూ.15 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని వార్డుల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ



మహా నారాయణ సేవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ ప్రారంభించడానికి నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యుల సమావేశం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్నినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఇక్కడ ఏటా అయ్యప్ప, భవానీ మాలధారులతోపాటు ఇతర మాలధారులకు మహా నారాయణ సేవ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నవంబర్ 14 నుంచి డిసెంబర్ 28 వరకు అన్నప్రసాదం అందించడానికి నిర్ణయించి కరపత్రాలు ఆవిష్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, ముఖ్య సలహాదారుడు గుగ్గిళ్ల సాయి, సభ్యులు వేణుస్వామి, మధు పంతులు, శ్రీనివాసరావు, నల్లి నర్సింగరావు, కనకల సన్నిబాబు, ప్రగడ చంటి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ముహూర్తపు రాట

సీతమ్మధార: గణేష్ ఉత్సవాలకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో బుధవారం విజయగణపతి నవరాత్రి మహోత్సవానికి సంబంధించి అర్చక బృందం వేదమంత్రాల నడుమ పందిరి రాట వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా గణపతిని ప్రతిష్టిస్తున్నట్లు తెలిపారు. 9 రోజుల పాటు పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, ఉత్సవ కమిటీ సభ్యుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, సాడి పద్మారెడ్డి, బర్కత్ అలీ, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎస్.శశికళ, చలోక్ రజని, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, ఉత్సవ కమిటీ సభ్యులు కె.అనిల్‌కుమార్‌రాజు(14వ వార్డు కార్పొరేటర్), కిరణ్ రాజ్, అంబటి శైలేష్, నీలి రవి, ఆళ్ల శివగణేష్, రాజాన రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా దంతేశ్వరి యూత్ ఆధ్వర్యంలో..

సీతంపేట: శ్రీదుర్గా దంతేశ్వరి యూత్ ఆధ్వర్యంలో వినాయక ద్వాదశరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సీతంపేట గొల్లవీధి సాయిబాబా ఆలయం వద్ద బుధవారం ముఖ్య అతిథి సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, ముత్తయిదువలు, నిర్వాహకులతో కలిసి పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. ఏడేళ్లుగా దంతేశ్వరి యూత్ చవితి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు, పదడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 11 రోజుల పాటు పూజలు చేసి భారీ ఊరేగింపు నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నమ్మి వెంకట్, దంతేశ్వరి యూత్ కోడిబోయిన సాయి, కోడిబోయిన దంతేష్, వియ్యపు ఆదిత్య, పల్లా రోహిత్, చందు, పండు, గౌతం, యశ్వంత్, సుమంత్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ



వెండి కిరీటాలు, ఆభరణాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజు పాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజుపాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవిప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామప్రసాద్ రూ. లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.